# ఓరి కొడుకుల్లారా వర్ధిల్లండి!

అనగనగా ఒక రాజ్యం. రాజులేని రాజ్యం.

రాజులేని రాజ్యం అంటే పూర్తిగా రాజు లేకుండాపోడు. రాజు వుంటాడు. రాజవంశం నుండి వంశానుగతంగా రాజయిన రాజుకాదు. ప్రజల్లోంచే ఒకరు రాజవుతారు; ఒకరై రాజ్ఞి అవుతుంది.

ఈ రాజపదవి రావటం పూడటంకూడ ఎంతో విచిత్రంగా జరుగుతుంది.

మహేంద్రుని ఐరావతంలాటి ఒక తెల్లని ఏనుగు వై జయంతిమాలవంటి ఒక పుష్ప హారాన్ని తొండానికి తగిలించుకుని వస్తుంది. ఆ ఏనుగు ఆకాశవీధుల్లోంచి నడుచుకుంటూ వస్తుందో, సముద్రగర్భాన్ని చీల్చుకుంటూ వస్తుందో, పాతాళాన్నే బ్రగలకొట్టుకుంటూ వస్తుందో తెలియదు. మొత్తానికి వస్తుంది.

వచ్చీ వచ్చీ ఎవరి మెడలోనో ఆ హారాన్ని వేస్తుంది. ఫలానవారి మెడలో వెయ్యాలని లేదు. అది కట్టెలుకొట్టే కనకయ్య కావచ్చు. చింతపండు అమ్ముకునే చెంగయ్యా కావచ్చు. పాఠాలుచెప్పే పరంధామయ్య కావచ్చు.

అలా ఆ ఏనుగుచేత హారమెయ్యబడిన వాడు రాజవుతాడు. అతనికి విద్యాసంస్కారం వుండాలని లేదు. రాజ్యపాలనా దక్షత వుండాలనీ లేదు. ప్రజాసేవా సవ్రత వుండాలని అంతకంటే లేదు.

ఆ తర్వాత ఆ ఏనుగు ప్రధాన రాజకూడలికి పోయి అంతవరకు రాజుగా వున్నవారి శిలా విగ్రహాన్ని కాళ్ళతో తొట్టగించివేస్తుంది. అంతటితో అతని రాజరికం పోతుంది. కొత్త రాజుకు రాజ్యాన్ని కట్టబెట్టాలి.

ఇక తన పని అయిపోయినట్లు ఆ ఏనుగు ఎలా వచ్చిందో అలా వెళిపోతుంది. మళ్ళీ అయిదేళ్ళ కొస్తుందో, మరేడేళ్ళ కొస్తుందో, మూడాళ్ళకే వస్తుందో తెలియదు. మొత్తానికి వస్తుంది.

ఇది అనాదిగా ఆ రాజ్యానికొస్తోన్న సంప్రదాయం. దీన్ని దేవతలే పెట్టారో, దేముళ్ళే పెట్టారో, పూర్వ ఋషులే పెట్టారో.

ఈసారి అసిరయ్య రాజయ్యాడు. అసిరయ్య ఎప్పుడో రాజుగారి దివాణంలో తాబేదారుడుగా వుండేవాడు.

రాజవగానే అసిరయ్య అసిరశేనుడయ్యాడు. ప్రధాన రాజకూడలిలో అతని శిలా విగ్రహం వెలిసింది. ఒక మారుమూల గొందిలో, ఒక పాత పెంకుటింట్లో వుండే అసిరయ్య కుటుంబసమేతంగా, మేళతాళాలతో, వేదమంత్ర పఠనాలతో సుందర రాజ ప్రాసాదానికి తరలివచ్చాడు.

జూద గృహాలల్లో, వేశ్యావాటికల్లో జులాయి తిరుగుళ్ళు తిరిగే అసిరయ్య ఒక్కగాని ఒక్క కొడుకూ, ఆగమ్మకాకీ అయిన సూరయ్య, సూరశేన యువరాజయ్యాడు. ప్రక్క గ్రామంలో గుర్రాలకు నాడాలు కొట్టే అల్లుడూ, కూతురూ రాజగృహానికి వచ్చేశారు. వారు రాజబంధువులై సకల రాజ మర్యాదలూ పొందుతున్నారు.

ఇక, క్రొత్తగా యువరాజైన సూరయ్య-సూరశేనుడు పోయే రాచపోకిళ్ళకు హద్దూ అపూ లేకుండా పోయింది. యువరాజ మందిరం విలాసభవనమైపోయింది. జ్యూత క్రీడలకు, వేశ్యాంగనల నృత్యగాన వినోదాలకు ఆలవాలమైపోయింది. మధువు ఏరులై పారింది.

అంతవరకయితే ఫర్వాలేదు. పట్టిన మనాన్ని వదిలించుకుంటున్నాడని సరిపెట్టుకోవచ్చు. కాని, అంతటితో ఆగలేదు. కన్యల్ని చెరబట్టాడు. మానవతుల మానాన్ని దోచుకోసాగాడు. తన విలాసాలకు కావల్సిన ధనాన్ని వర్తకుల దగ్గర గుంజటం మొదలుపెట్టాడు.

ప్రజలు అధికారులకు, అధికారులు మంత్రులకు, మంత్రులు రాజుగారికి మొరపెట్టుకున్నారు.

యువరాజుగారి అత్యాచారాలను విచారించి తగువిధంగా దండించాలని మంత్రులు రాజుగారికి సలహాయిచ్చారు.

రాజు మంత్రులమీద విరుచుకుపడ్డాడు. ఎవరో ఏదో కూశారని నా కొడుకుమీద విచారణ జరపాలా, ఈ పసివాడ్ని దండించాలా అని మొగం కండలన్నీ పీక్కున్నాడు.

రాజుకు తెలుసు—తన కొడుకు చేస్తున్న వెధవ పనులు. న్యాయవిచారణ జరిపిస్తే కొడుకు నేరాలు ఋజువవుతాయి. ఋజువైన నేరాలకు మరణదండన విధించటమో, దేశ బహిష్కృతుడ్ని చెయ్యటమో, చేతులు నరికించటమో చేయాలి. లేకలేక పుట్టిన ఒక్కగాని ఒక్క కొడుకు. తను ఎత్తుకుని పెంచి, తన గుండెలమీద ఆడించి పెంచినవాడికి ఇంతటి కఠినశిక్ష విధించటమా? అమ్మో!

రాజు కోపంగా, "నాకుముందు చాలామంది రాజులున్నారుగా. వాళ్ళకీ పుత్రులున్నారుగా. వాళ్ళల్లో ఎవడు 'పత్తిత్తు'. ఎవరెన్ని ఘోరాలు చేశారో మీకూ తెలుసు. నాకూ తెలుసు. ప్రజలందరికీ తెలుసు. వాటిముందు మావాడు చేసిన నేరాలు ఏపాటివి?" అన్నాడు.

"అందుకే వాళ్ల శంకరగిరి మాన్యాలు పట్టిపోయారు. ఆ కొడుకులు మూలంగానే ఈ దేశం ఇలా వుంది?"

"నేనూ పోతాను. నేనుమాత్రం శాశ్వతంగా వుంటానా? ఆ ఏనుగు ఎప్పుడు వస్తుందో ఏమో?"

"రాజు ప్రజలకు మంచి చేస్తున్నంతవరకు ఆ ఏనుగురాదని అందరి నమ్మిక మహారాజా"

"అది నమ్మిక మాత్రమే!" అని రాజు కోపంగా చెరచెరా వెళ్ళిపోయాడు.

కొడుకును మందలించాలనుకున్నాడు. రాణివాసానికి రమ్మని కబురుపెట్టాడు.

రాణి నాగుమణీదేవి (పూర్వాశ్రమంలో నాగమ్మ) దైవభక్తీ, పాపభీతీ వున్నది. శాస్త్ర వాదస్తురాలు. ఎప్పుడూ పూజలు, పునస్కా-

## అరిగె రామారావు

దీపావళి శుభాకాంక్షలతో

★

# లక్ష్మీ శానిటరీ

ఇంజనీర్స్ అండ్ కంట్రాక్టర్స్
27-6-155, ప్రకాశం రోడ్
విజయవాడ-520 002

ఫోన్: { ఆఫీస్ : 75009 / రెసి. : 72476 }

ఇ.ఐ.డి. పారీవిట్రియస్ శానిటరీవేర్
హెచ్.ఆర్. జాన్సన్ టైల్స్
అండ్ లీడర్ జి.ఎమ్. స్పెషల్స్‌కి
డీలర్లు మరియు
బ్రిటిష్ పెయింట్స్, డ్యూడెల్,
ఆసియన్ పెయింట్స్, ఎనామైట్
పెయింట్స్‌కి స్టాకిస్టులు
ఎ.సి. పైపులు, జి.ఐ. పైపులు,
పి.ఐ. పైపులు మరియు
ఫిట్టింగ్స్, డ్రైనేజి పైపులు
కూడా మావద్ద లభించును

రాలూ, భజల్ను, నోములూ వ్రతాలూ చేస్తుం టుంది.

ఆమెకూడ కొడుకును గురించి యెన్నో విన్నది ఆ ప్రస్తావనతెచ్చి కొడుకును దండించ మని భర్తకు సలహా యిచ్చింది.

రాజు తల పట్టుకున్నాడు. "దండన అంటే లెంపకాయలు వాయించటం కాదే వెర్రి మొగమా! తల తీయించాలి. ఈ రాజరికం ఏదో అయాచితంగా వచ్చింది. ఎన్నాళ్ళుం టుందో ఎప్పుడు వూడుతుందో తెలియదు. ఎప్పుడూ వుండేవాడు వీడు. రేపు నీకూ, నాకూ తలకు కొరివి పెట్టాల్సినవాడు!" ఆవేశంగా అన్నాడు.

"పోనీ, ఈ పదవినే వదులుకుందాం!" అమాయకంగా అంది.

"ముష్టి పేడ పిసుక్కోవాలి!" కోపంగా అన్నాడు రాజు.

ఈ అష్టైశ్వర్యాలూ, ఈ రాజభోగాలూ చూస్తూ చూస్తూ వదులుకుంటాడా?

"పోనీ, అబ్బాయికి పెళ్ళి చెయ్యండి. అప్పటికయినా మారుతాడేమో!" అంది.

రాజుకు ఈ సలహా నచ్చింది. ఒక చక్కని పిల్లను చూచి మహావైభవంగా పెళ్ళి జరిపిం చాడు.

ఆ వచ్చినావిడ కొడుకును మించిపోయింది. మహాతల్లి నాల్గు ఆకులెక్కువ చదివింది. దీపం వుండగానే యిల్లు చక్కపెట్టుకోవాలి; ఆ ఏనుగు వచ్చేలోపలే అందినంత రాబట్టుకొని కూడబెట్టుకోవాలి. మన తరతరాలవాళ్ళుకూడా సుఖంగా బ్రతికేటంత ధనాన్ని చేజిక్కించుకో వాలి — ఇది ఆమె వేదాంతం. భర్తను తొక్కిపెట్టి దేశాన్ని దోచుకోవటం మొదలు పెట్టింది యువరాజే నయమనిపించింది.

ప్రజల్లో మళ్ళీ గొడవ. రాజుగారి కొడుకు మీద, కోడలిమీద న్యాయవిచారణ జరిపించా లని గొడవ మొదలుపెట్టారు. చిన్నచిన్న విప్లవాలు చెలరేగాయి.

రాజుగారు తలపట్టుకున్నారు. ఆంతరంగిక మందిరంలోకి కొడుకునూ, కోడల్నీ పిలిపిం చారు. మీరు చేస్తోన్నదేమీ బాగాలేదన్నారు. "అసలికే నేను ఆ ఏనుగు యెప్పుడు వస్తుందో ఏమో అని హడలిచస్తూ మనఃశాంతిలేక వున్నాను. మధ్యలో మీరిలా చేస్తే యెలా?" అన్నాడు మందలింపుగా.

"అసలు ఆ ఏనుగునే రానీయకుండా చేస్తే—" అన్నాడు యువరాజు.

"అదెలా?"

"అది నాకు వదిలేయండి. మీరు విశ్రాంతిగా వుండండి!"

బయటికొచ్చాక, "నాన్నగారికి విశ్రాంతి ఇవ్వాలి!" అన్నాడు మర్మగర్భంగా నవ్వుతూ.

ఆ రాత్రి మదవతి అని పిలవబడే ఒక మహా సౌందర్యరాశీ, ప్రౌఢస్త్రీ రాజుగారి సపర్యలకోసం రాజమందిరాని కొచ్చింది.

ఆనాటినుండి రాజు మదవతి పరిష్వంగ సుఖాసక్తుడు, మధుపానమత్తుడూ అయి పోయాడు.

యువరాజు సూరసేనుడు చక్రం త్రిప్పటం మొదలుపెట్టాడు. మెల్ల మెల్లగా రాజ్యపాల నాధికారాలను చేజిక్కించుకున్నాడు. అధికా రుల మీద అధికారం చెలాయించడం మొదలు పెట్టాడు. మంత్రులను కూడగట్టుకున్నాడు. యెదురు తిరిగిన వాళ్ళను చెరసాలలో పెట్టి చాడు. అవసరమనుకున్నవాళ్ళను హత్య చేయించాడు. రకరకాల పన్నులు విధించి ప్రజలను పీడింపసాగాడు. అనువైన ఆస్తులను స్వాధీనపర్చుకున్నాడు. సొంత భవన మొకటి నిర్మించుకొని దాని నేలమాళిగల్లో ధనరాశులను కూడబెట్టసాగాడు. దేశంలో అరాజకం తల యెత్తింది. ఇదే అదననుకొని దేశంలో చోరులు, దేశద్రోహులు, నల్లవ్యాపారస్థులూ విజృంభించారు. యెవరి కందింది వాళ్ళు దోచుకోసాగారు. సామాన్య ప్రజల మనుగడ దుర్భరమైపోయింది. విప్లవాలు చెలరేగాయి.

ఆ విధంగా ఆ దేశాన్ని అరిష్టం పట్టింది.

అందరూ ఇక ఏనుగు వస్తుందనుకున్నారు. రేపు వస్తుంది, మాపు వస్తుంది అనుకున్నారు. ఏళ్ళు గడుస్తోన్నాయి కాని ఏనుగు రావటం లేదు. ఏనుగును పొలిమేరల్లోనే పట్టి మట్టు పెట్టారన్నారు. నిలువెత్తు కందకం తీసి దాన్ని పూడ్చిపెట్టారన్నారు. ఏమయిందో ఏమో యెవ రికి తెలియదు. ఏనుగు జాడయితే లేదు.

రాను రాను ఆ దేశం పరిస్థితి కుక్కలు చింపిన విస్తరయిపోయింది; ఆ రాజ్యలక్ష్మి తన స్థితికి అతి దైన్యంగా, కన్నీరు మున్నీ రుగా రోదించసాగింది.

ఇలా వుండగా ఒకనాటి యుషస్సు సమ యాన, చీకట్లను చీల్చుకుంటూ తెల్లని ఏనుగు ఘీంకారాలు పెట్టుతూ అతి భయంకరంగా వచ్చింది. రాగానే అపిరశేనుడి శిలావిగ్రహాన్ని మట్టగించివేసింది. అటునుంచి రాజభవన వయిపు పరుగులు తీసింది. ఒక్క నాగమ్మను



తప్ప మిగతా అందర్నీ కాళ్ళతో మట్టగించి పచ్చడించి, త్రొక్కి త్రొక్కి ఘాతమార్చింది.

చివరకు శాంతించింది.

అప్పుడు ఆ ఏనుగు కడుపులోంచి జయ జయ ధ్వానాలుచేస్తూ జనం బయటికొచ్చారు.

దేశాన్ని నడిపించాలంటే ఆ జనంలోంచే ఒకడు నాయకుడవ్వాలి. ఆ నాయకుడు నిస్వార్ధ పరుడవ్వాలి. సర్వబంధాల కతీతుడయిన వాడయి వుండాలి. దేశసేవను ఒక తపస్సుగా, ఒక మహాయజ్ఞంగా స్వీకరించగలిగినవాడయి వుండాలి.

అప్పుడే ఆ దేశానికి పట్టిన పీడ వదులుతుంది।

అప్పుడే ఆ దేశప్రజలు సుఖపడుతారు।

అప్పుడే ఆ దేశమాత సంతోషిస్తుంది। *